కథ

# నాన్నకు జైజై

**"నా జన్మభూమి ఎంతో అందమైన దేశము...
నా యిల్లు అందులోన కమ్మని ప్రదేశము...
నా సామిరంగ....హోయ్ హోయ్...నా సామిరంగా..."**

**వారం రోజులుగా సతీశ్ చంద్ర నోటిలో ఇదే పాట నలుగుతోంది. ఏమాత్రం సందు దొరికినా టీవీలో యాడ్‌లాగా ఠక్కున అతని నాలుక మీద నర్తిస్తోంది.**

వారం క్రితం సొంత ఊరెళ్లొచ్చిన ఆనందమది. రెండేళ్లుగా తీరిక లేని పనులతో ఊరికెళ్లడం కుదరని చంద్ర మొక్కుబడి చెల్లింపులా పనిగట్టుకొని, సెలవుపెట్టుకొని మరీ స్వగ్రామం వెళ్లి వచ్చాడు. పుణ్యతీర్థ సందర్శనంతో పులకించిన భక్తునిలా కన్నతల్లినీ, ఊరునీ చూసి బాధలూ చికాకులన్నీ మరచిపోయాడు. మళ్లీ సిటీలోని కాలచక్రాల కింద నలిగిపోకుండా పరుగులు పెడుతూనే ఇంటి నుండి మోసుకొచ్చిన ఆనందం చప్పరిస్తున్నాడు. అంతే గాదు, కనిపించిన వారికల్లా ఆ ఆనందాన్ని పంచిపెడుతున్నాడు. అందులో భాగంగానే మిత్రుడైన మాధవరావు వద్దకూ ఈ పయనం ఏర్పాటు చేసుకున్నాడు.

బస్సు దిగి ఉస్సురుమంటూ సుమారు కిలోమీటరు దూరం కొలవడం ప్రారంభించాడు. బండి ఉన్నా దాన్ని ఖాళీగా ఉంచడు కుమారరత్నం. కారు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే వాడటం అతని పద్ధతి. అయినా శ్రమ తెలియకుండా బేతాళుడు విక్రమార్కునికి కథ చెప్పినట్లు అతని లోపలి మనసు ఆనందగీతం పాడుతోంది. ఆ నేపథ్య సంగీతం అందిస్తున్న హుషారుతో నిజంగానే శ్రమ తెలియకుండా నడుస్తున్నాడు.

సడెన్‌గా అతని పాట, ఆపై నడకా ఆగిపోయాయి. 'తన కళ్లు పొరబడటం లేదుకదా!' అనుకొని కళ్లు నులుముకొని మరీ చూశాడు. 'నిజమే' అనిపించాక-

"ఒరే మధూ!" గట్టిగా కేకేశాడు.

రోడ్డుకి అవతలి వైపు నుండి వాలుగా నున్న దారిని పర్వతారోహకునిలా ఆపసోపాలు బడుతూ సైకిల్ తొక్కుతూ వెళ్తున్న మాధవరావు ఆ మాట వినీ విననట్టు అలాగే కంటిన్యూ అయ్యాడు.

మరోమారు ఊపిరితిత్తుల్లో బలం పెంచుకొని కేకేయక తప్పలేదు చంద్రకి.

సైకిల్ తోలడం ఆపి, ఎడమకాలు నేలకానించి చంద్ర వైపు పరిశీలనగా చూశాడు.

"చందూ!" ఉన్న చోటి నుండే కేక పెట్టాడు.. చూడగానే.

రోడ్డుకటూ ఇటూ చూసి గబుక్కున క్రాస్ చేసి ఇవతలి వైపు వచ్చాడు చంద్ర.

సైకిల్ హాండిల్‌నొక చేత్తో పట్టుకొని మరో చేత్తో మిత్రుని ఆలింగనం చేసుకున్నాడు మాధవ. క్రికెట్ పిచ్ మీద బ్యాట్స్‌మెన్‌లా మిత్రులిద్దరూ పరామర్శాభినందనాలింగనం చేసుకున్నారు.

"ఎక్కడికిరా?" మధు ఆశ్చర్యం వెనుక నటన.

"ఆ! నేనా? ఇక్కడో సెటప్పుంది...అందుకే!" వ్యంగ్యంతోనే సమాధానం చెప్పాడు చంద్ర.

"అవునా? ఎప్పుడూ నాతో చెప్పనే లేదే?" మరింత ఆశ్చర్యం నటించాడు మాధవ.

"కొట్టానంటే..." గాల్లోకి చెయ్యెత్తాడు చంద్ర.

"ఆపావేం? నేనేం మీ ఆవిడ్ని కానుగా ఎదురు తిరగడానికి? కానియ్!" నవ్వాడు మాధవ.

"మరి తిక్క తిక్క ప్రశ్నలడుగుతావేంట్రా?" నొచ్చుకుంటూ, ఎత్తిన చేయి భుజం మీద వేశాడు చంద్ర.

"ఎన్నాళ్లైందిరా మరి? నేనొక్కడ్నిక్కడున్నానని అసలు గుర్తుందా?"

"అనే అవకాశం వచ్చింది కదా! అను. నేనూ అనగలనులే!"

"ఒక్కడివే వచ్చావేం?"

"అందరమూ రావాలంటే మరో ఆర్నెలలు పడుతుంది... అది సరే. ఈ వయసులో సైక్లింగేమిట్రా? ఎక్సర్‌సైజు కోసమా?"

"ఇంటికి పద! చెబుతా!"

ఇద్దరూ మాధవ ఇంటివైపు అడుగులేయసాగారు.

'పట్నాల్లో పరిచయస్తులుంటారు. స్నేహితులుండరు' అనే నానుడి (నేటి + నుడి)కి అతీతంగా వాళ్లు స్నేహితులయ్యారు. పదేళ్ల క్రితం జీవితాన్ని సవాలుగా తీసుకొని, అన్నదమ్ముల మధ్య ఇమడలేక హైదరాబాద్ చేరిన చంద్రానికి మాధవ పరిచయమయ్యాడు. జీవితాన్ని ఎలా చక్కదిద్దుకోవచ్చో చూపించే ఆదర్శమూర్తియై మార్గదర్శనం చేశాడు. పనిలేక, పూట గడవక భార్యాబిడ్డలతో విల్లాడుతున్న చంద్రానికి అండగా నిలిచాడు. తను పని చేస్తున్న స్కూల్లోనే అతనికి ఉద్యోగమిప్పించాడు. ఆ జీతం జీవితం అప్పటికి పర్వాలేదనిపించినా 'గొర్రెతోక'తో భవిష్యత్తు ప్రశ్నార్థకం అనిపించేది చంద్రానికి. అదే సమయంలో ఊళ్లో ఉన్న ముగ్గురన్నదమ్ములూ సరిపడక వేరుపడటం, తల్లితోపాటు ఆస్తిని అయిదు భాగాలుగా చేసి తండ్రి తనువు చాలించడమూ జరిగిపోయాయి.

చంద్రం వంతు ఆస్తిని తల్లి చూసుకునేందుగ్గాని, అనుభవించేందుగ్గానీ అంగీకరించకపోవడంతో అమ్మక తప్పలేదు. ఆ వచ్చిన డబ్బుతో అప్పటికే ఏర్పడ్డ స్నేహితులు... కాదు, పరిచయస్తులతో కలిసి ఫైనాన్స్ ప్రారంభించాడు. నాలుగేళ్లలో ఉద్యోగం వదిలేసి, అదే వ్యాపారంలో స్థిరపడిపోయాడు. దాంతో కె.పి.హెచ్.బి. నుండి దిల్‌సుఖ్‌నగర్‌కి ఇల్లు మారిపోయింది. స్నేహితులిద్దరి మధ్యా ఆ విధంగా దూరం పెరిగింది. కానీ, అది భౌతికమైందే. 'దూరమైన కొలదీ పెరుగును అనురాగం...' అన్న కవి వాక్కులా వాళ్ల ఆత్మీయతను చెరిపేయలేక పోయింది.

ఉద్యోగాన్నే నమ్ముకున్న మాధవ, చంద్రకి బిజినెస్ పార్టనర్‌లా ఉండేందుకు అంగీకరించలేదు. కొన్ని ప్రైవేటు బ్యాంకుల దగుల్బాజీతనం వల్ల చంద్ర ఫైనాన్స్ కూడా మునుపటి వైభవాన్ని కొంత కోల్పోయింది.

"పిల్లలేరీ?" తెచ్చిన స్వీట్లూ, పండ్లూ రాధ చేతికిస్తూ, పరికించి చూశాడు చంద్ర. రాధ, మాధవుడి భార్య.

"వాళ్లెళ్లి నాలుగు నెలలైంది. ఈయనగారు చెప్పనే లేదా?" నవ్వుతూ చంద్ర చేతిలోని క్యారీబ్యాగ్ తీసుకుంది రాధ.

మాధవ వైపు చూశాడు చంద్ర.

"ఎక్కడా? లాండ్ ఫోన్‌లో నువ్వు దొరికితే కదా! మొబైల్‌కి ఫోన్ చేసే వ్యవహారం కాదు మనది" నవ్వుతూనే మాధవ.

'కరెక్టేనేమో!' అనిపించింది చంద్రకి. టీవీలొచ్చి రేడియోల్ని కట్టేసేలా చేశాయి. టెలిఫోన్లు మనుషుల్నే కట్టేస్తున్నాయి. రెండూ బద్ధకానికి మహారాజ పోషకులే.

"ఊ! ఇప్పుడు చెప్పు!" చల్లటి వాతావరణంలో వెచ్చటి కాఫీ, కమ్మగా చప్పరిస్తూ అడిగాడు చంద్ర.

"ఏముందీ, అమ్మాయిని విజయవాడలో పీజీ కాలేజ్‌లో చేర్పించక తప్పలేదు..."

"ఓహో దాని స్కూల్ ఎడ్యుకేషన్ అమ్మమ్మ వాళ్ల దగ్గర పూర్తయింది కదూ! అది అక్కడి నేటివ్ అయిందేమో!" స్వగతంగా అనుకున్నట్లు అన్నాడు చంద్ర - కారణాన్ని సమీక్షించుకుంటూ.

"ఇక... ఆత్రికి ఇంజినీరింగ్‌లో జహీరాబాద్‌లో సీటొచ్చింది" కొడుకు ఆత్రి గురించి పూర్తిగా చెప్పనే లేదు మాధవ.

"ఓహ్! అందుకేనా, లైఫ్‌ని ఎంజాయ్ చేస్తున్నావ్ - సైకిల్ మీద."

చంద్ర కొనమెరుపుకి మాధవ నవ్వాడు

మాటవరసకైనా నవ్వలేదు రాధ.

"ఏం? ఒంట్లో కొవ్వెక్కువవుతోందని సైక్లింగ్ చేస్తు

న్నావా?"

తేనెలో అద్దిన గుళికలా ప్రశ్న విసిరాడు చంద్ర.

"బాగా అడిగావు. అలా అడుగు." వత్తి, వత్తాసు పలికింది రాధ.

"సైక్లింగ్ నాకేమీ కొత్త కాదురా. ఇరవై యేళ్లు సైకిల్ తొక్కాను. నిజానికి అది మానేశాకే రకరకాల అనారోగ్యాలు" తననే చిత్రంగా చూస్తున్న చంద్రని చూసి ఆగిపోయాడు మాధవ.

"ఆపావేం?" సూటిగా మాధవ కళ్లలోకి చూశాడు- "నీలాంటి వాడే. 'ఇరవయ్యేళ్లనాడు నాకెంత బలముందేదో ఇప్పుడూ అంతే బలముందన్నాడట. పక్కనున్నోడు ఆశ్చర్యపోయి 'అదెలా?' అంటే - 'సింపుల్! అప్పుడూ నేను యాభై కేజీల బస్తా మోయలేకపోయే వాడిని. ఇప్పుడూ మోయలేకపోతున్నాను.' అన్నాడట"

రాధ నవ్వాపుకోలేకపోయింది.

"ఎన్నేళ్లయిందిరా ఇలా మాట్లాడుకొని." కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి మాధవకి.

"మాట మార్చకురా! స్కూటర్ ఏం చేశావో చెప్పు!" చంద్ర.

"చెప్పడానికేముంది? అమ్మేశాను." తడుముకోకుండా అనేశాడు మాధవ.

"త్వరగా రెడీ అవ్వు. బైక్ తీసుకొద్దాం!" ఆజ్ఞాపిస్తూ రిస్ట్ చూసుకున్నాడు చంద్ర. అప్పుడు రాత్రి ఎనిమిది కావస్తుంది.

ఆశ్చర్యంలో రాధ.

తొణక్కుండా మాధవ.

"లేవరా!" రెట్టించాడు చంద్ర.

"నా సంగతి నీకు తెలుసు కదా" గంభీరంగా మాధవ.

"ఒకసారి నిర్ణయం తీసుకుంటే అందులో తిరుగుండదు."

"మధూ! స్నేహాన్ని గురించి గొప్పగా చెబుతావు కదరా! నా స్నేహితుడికి నేను సాయం చేసే అధికారం లేదా?" నొచ్చుకున్నాడు.

"ఉంది. నిజంగా నేను కష్టాల్లో ఉన్నప్పుడు నువ్వు సాయం చేయొచ్చు. నేను అడిగి మరీ నీ సహాయం పొందొచ్చు. కానీ, నాకే కష్టమూ లేదు. ఇది నా జీవన విధానం. అంతే! ఈ విషయం వదిలేస్తే మంచిది" అన్నట్లున్నాయతని మాటలు.

"పోనీ, నా బండి తెచ్చి వాడుకో!" అభ్యర్థించాడు.

"నో! ఆ సంగతి వదిలేయ్‌రా!" అయిష్టంగా మాధవ.


"ఒరేయ్! నువ్వు రాజు కంటే అధికుడివిరా!" 'మొండివాడివి' అనే అర్థంలో అన్నాడు చంద్ర.

"నువ్వెలా అనుకున్నా సరే!" ముక్తసరిగా మాధవ.

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా దొర్లాయి.

"మధూ! పిల్లల కోసం తల్లడిల్లే తల్లిదండ్రుల గురించి చదివాను. విన్నాను. కానీ ఒక సౌకర్యాన్ని సైతం అమ్మేసి కష్టపడే వాడ్ని నిన్నే చూస్తున్నానురా!" గుండె చెమ్మగిల్లింది చంద్రకి.

"చందూ! నా కోసం మా నాన్న పడ్డ కష్టం ముందు ఇదేమంత గొప్పదిరా?" గతమంతా కళ్లముందు కదలాడుతుండగా చెప్పసాగాడు మాధవ.



"అక్షర జ్ఞాన దీపాలు వెలగని చీకటి గుహలాంటి మా ఊళ్లో నేనెలాగైనా బాగా చదివి ఉపాధ్యాయుడ్ని కావాలని కలలు గనేవాడు మా నాన్న. రెండెకరాల భూమి. రెండెడ్లతో ఉన్నంతలో తోటివారికి సాయం చేస్తూ హాయిగా, దర్జాగా బతికేవాడు. మా ఊళ్లో అసలు బడే లేదు. పక్క ఊళ్లోకెళ్లి ఏడవ తరగతి అయిందనిపించాను. హైస్కూల్ కెళ్లాలంటే దగ్గర్లో ఉన్న టౌన్‌కెళ్లాలి. అది పన్నెండు కిలోమీటర్లు మా ఊరికి. హాస్టల్ వసతి కులం అడ్డుగోడలా నిలిచింది. అక్కడే అద్దె కొంపలో ఉంచి చదివించేందుకు నాన్నకి శక్తి చాలలేదు. ఎలాగో తొమ్మిదవ తరగతి కానిచ్చాను. సుమారు నాలుగ్గంటలు కాలినడకకే సరిపోయేది. ఏదో బడిలో పంతుళ్లు చెప్పిన పాఠాలు గుర్తుంచుకొని గట్టెక్కాను. చదువుకునేందుకు రాత్రి ఓపికుండేది గాదు. ఉదయం సమయముండేదీ కాదు. ఆదివారం మిగిలిపోయిన హోంవర్కులేమయినా ఉంటే పూర్తి చేసుకునేందుకే చాలకపోయేది. ఇదంతా చూసిన నాన్న పదో తరగతిలో ఆయనకు తెలిసినవాళ్ల అబ్బాయినొకడ్ని జత చేసి, ఓ అద్దె గదిలో నేనుండే ఏర్పాటు చేశాడు. అన్ని రోజుల కష్టం సుఖంగా మారేసరికి అది నాకు 'కుక్క - నెయ్యి' సామెతలా అయింది. వండుకోవడం, తినడం, డబ్బులుంటే సినిమా చూడటం, పడుకోవడం ముఖ్య వ్యాపకాలయ్యాయి. పదో తరగతి తప్పాను.

నా కంటే నాన్నను అది ఎక్కువ కృంగదీసింది. మా మధు బాగా చదువుతాడని అందరితో చెప్పుకునే నాన్న తలెత్తుకోలేని స్థితి ఏర్పడింది. నాన్నకు మొహం చూపలేక ఆత్మహత్య చేసుకోవాలనిపించింది. అమ్మ నన్ను ఎదురుగా కూర్చోబెట్టుకొని వలవలా ఏడ్చింది. నాన్న మాత్రం ఒక్క మాటైనా అనలేదు. "మధూ! చదువుతావా? ఆపేస్తావా?" అని మాత్రం అడిగాడు.

నా కోసం కాకపోయినా, నాన్నకోసం, నాన్న పరువు కోసం చదవాలని ఆ క్షణమే నిర్ణయించుకున్నాను. 'చదువుతా'నని చెప్పాను పాడిగా. ఆర్నెలలు కష్టపడి చదివి,

**దొరవేటి**

అన్ని పరీక్షలూ రాసి ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను. నాన్న నమ్మకాన్ని సాధించాను. అయినా నా లక్ష్యం అది కాదు. ఎలాగైనా సరే ఉపాధ్యాయుడి హోదా సాధించాలి. అందుకే ఆ క్షణమే నిర్ణయించుకున్నాను. 'మళ్లీ ఊళ్లో కాలు పెడితే ఉపాధ్యాయుడిగానే కాలు పెట్టాలి' అనుకుంటూ ఊరు వదిలాను.

నేను అడగకుండానే అవసరానికి సరిపడా డబ్బు పంపించేవాడు నాన్న. నా దృష్టి అంతా చదువు మీదే. అప్పట్లో ఎంట్రెన్స్ టెస్టులు ఇలా ఉండేవి కాదు. మార్కుల ఆధారంగానే సీట్లు దొరికేవి. కనీసం అరవై శాతం మార్కులు తెచ్చుకుంటే సీటు లభించే అవకాశముండేది. నా కష్టం వృధా కాలేదు. డెబ్బై అయిదు శాతం మార్కులు సంపాదించాను. కాలేజీ ఫస్ట్ నేనే. అమ్మా పదే పదే చెప్పి పంపించడంతో ఒక్కసారి ఊరికెళ్లి రావాలని సిద్ధమయ్యాను. ఒకప్పుడు పదో తరగతి ఫెయిలై అమ్మా నాన్నల్ని బాధ పెట్టిన నేను కాలేజీ ఫస్టుగా ఊళ్లోకడుగు పెట్టి, వాళ్ల కళ్లల్లో వెలుగు చూడటమూ మంచిదనిపించింది.

"నిజంగానే ఆ రోజు పండగ చేసింది అమ్మ. కనిపించిన ప్రతి ఒక్కడికీ నా గొప్ప గురించి నాన్న చెబుతుంటే నిజమైన పుత్రోత్సాహం ఎలా ఉంటుందో తెలుసొచ్చింది. వరల్డ్ కప్ సాధించిన జట్టులో సభ్యుడినైనంత ఆనందం నన్ను కుదిపేసింది. తిరిగొస్తుంటే తెలిసింది నాన్న తాకట్టు పెట్టిన పొలం, అప్పు తీర్చనందుకు కామందు ముదరేసుకున్నాడని. నాకు కాళ్లాడలేదు. తల్లిదండ్రిని కష్టపెట్టి ఇంకా చదవడం కంటే చదివిందానికి ఏదో పని చూసుకొని వాళ్లను పోషించుకోవడమే బెటరనిపించింది. కానీ నాన్న ఒప్పుకోలేదు. ఆయన ఆశయం సాధించేందుకు మనసులోనే ప్రతిజ్ఞ చేసుకొని ఉన్న నేనూ కాదనలేకపోయాను. పైగా 'మధూ! మనం ఈ రోజుంటాం రేపు పోతాంరా! పోయే ముందు మనం ఎంత సంపాదించామని గాక, ఏం సాధించామనేదే చూసుకోవాలి. మన పొలంతో మనకు రుణం తీరిపోయింది. అయితేనేం ఓ ఏడాది గడిస్తే అలాంటివి ఎన్నయినా నువ్వు సంపాదించగలవు' అంటూ నచ్చ జెప్పాడు. కానీ...నేను...టీటీసీ...సర్టిఫికెట్ సంపాదించకముందే...ఆయన..." దుఃఖంతో గొంతు పూడుకొని పోయింది మధుకి.

కంగారుపడ్డాడు చంద్ర.

కళ్లు వత్తుకుంది రాధ.

"అమ్మ చెబితే గానీ తెలియలేదు. నాన్న పగలు కూలీ పనికి, రాత్రిళ్లు పొలాల కాపలాకి వెళ్లేవాడని...క్యాన్సర్ బాగా ముదిరిపోయేదాకా అమ్మకైనా తెలియనివ్వలేదని. పరిస్థితి విషమించగానే నాకు కబురు చేసింది...తీరా నేను వెళ్లేసరికే నాన్న..." దుఃఖాన్ని అదుపుచేసుకోలేకపోయాడు మాధవ.

మాధవ కథ విన్న చంద్ర మరింకేమీ మాట్లాడలేకపోయాడు. ఉత్సాహంగా బయలుదేరినవాడు భారమైన గుండెతో వెనుదిరిగాడు.

'మాధవ తండ్రిని మించిన కొడుకే. కొడుకు కోసం ఆ తండ్రి పడ్డ కష్టం కంటే ఇతను తక్కువేం కాదు. పిల్లల భవిష్యత్తు కోసం ముందే సిటీలో రెండు ప్లాట్లు కొనుక్కొని ఉంచాడు. కూతురి పెళ్లి కోసం మరింత అవసరమవుతుందని రెండు లక్షల చిట్ వేస్తున్నాడు. పిల్లల ఖర్చులు, ఆర్.డి.లు, చిట్స్ వగైరా పోనూ ఇల్లు గడవటం కష్టమే. ఉదయమూ, సాయంత్రం రోజూ నాలుగు గంటలు ట్యూషన్ చెబుతున్నాడు. కొడుక్కి ఖర్చుకు చాలడం లేదని స్కూటర్ మెయింటినెన్స్ కష్టమని ఏకంగా అమ్మేశాడు. నేను చెబితేనే వినడు. భార్యా పిల్లల మాట వింటాడా? కానీ, మాధవుడు ఇంతగా కష్టపడకూడదు. అందుకోసం ఏమైనా చేయాలి...' అనుకున్నాడు.

మరుసటిరోజే జహీరాబాద్ బయలుదేరాడు. హాస్టల్ కనుక్కోవడం పెద్ద కష్టం కాలేదు.

"అత్రిని పిలిపిస్తారా?" రిసెప్షనిస్టుని అడిగాడు చంద్ర.

"అత్రికేమవుతారు మీరు?" అతడు కళ్లజోడు వెనక నుండి ఎగాదిగా చూశాడు.

"మామయ్యని" పొడిగా చంద్ర.

"అతను వచ్చే టైమయ్యింది. కూర్చోండి." ముక్తసరిగా చెప్పి, రిసెప్షనిస్టు తన పనిలో లీనమయ్యాడు.

అక్కడ ఎక్కువసేపు కూర్చోవడం ఇబ్బందికరంగా అనిపించింది చంద్రకి. బయటి గుమ్మంలోకొచ్చి నిలబడ్డాడు. అది రెండంతస్తుల మేడ. హాస్టలు పై అంతస్తులో ఉంది. అక్కడ నిలబడి చూస్తే రోడ్డు మీద జరిగేవన్నీ స్పష్టంగా కనిపిస్తాయి.

సడెన్‌గా అత్రి కనిపించాడు అతనికి. హుడిబాబా మీద శరవేగంతో వచ్చాడు. వెనకో అమ్మాయి ఉంది. చంద్రం తల గిర్రున తిరిగినట్లయింది.

'ఆహా! ఒకపక్క తండ్రి ఉన్న బండి అమ్మేసి కొడుకు సుఖం కోసం సైకిల్ తొక్కుతున్నాడు. మరోపక్క ఈ ప్రబుద్ధుడు బైక్‌ల మీద అమ్మాయిలతో షికార్లు కొడుతున్నాడు.'

ఆ అమ్మాయి బండి దిగి చేతిసైగతో వీడ్కోలు చెబుతూ వెళ్లింది. అత్రి హడావుడిగా అక్కడికొచ్చాడు. చంద్రని చూడగానే గతుక్కుమన్నాడు.

"ఎక్కడి నుండిరా?" దాచాలనుకున్నా అతని కోపం దాగలేదు.

"మీరు...ఎప్పుడొచ్చారు మావయ్యా?" అప్పుడు అతడ్ని అక్కడ ఏమాత్రం ఊహించుకోలేక పోతున్నాడు అత్రి.

"ఆ అమ్మాయెవర్రా...?" మరో ప్రచండ కిరణం చంద్ర.

"అవన్నీ తర్వాత చెబుతా! ముందు రూంకెళ్దాం రండి!" సమాధానం కోసం చూడకుండా ముందుకు నడిచాడు అత్రి.

"అత్తయ్యా, శేఖర్, కిరణ్...అంతా బావున్నారా? అమ్మా నాన్నని కలిశారా?" గదిలోకెళ్తూనే అడిగాడు.

"ఆ! ఆ! బాగున్నారు. ముందు అడిగిందానికి జవాబు చెప్పు" అసహనం చంద్ర.

తప్పదన్నట్టు చెప్పసాగాడు అత్రి. "నేనూ మరో ఇద్దరు ఫ్రెండ్స్ కలిసి ఇక్కడొక ట్యుటోరియల్ నడిపిస్తున్నాము. సాయంత్రం, ఉదయం. ముగ్గురిలో ఒకతను ఇక్కడివాడే జగదీశ్. అతనిదే బండి. రెండ్రోజులుగా ఒంట్లో బాగాలేక అతను రావట్లేదు. అందుకే వాళ్ల సిస్టర్‌ని పంపించాడు. ఇక్కడిదాకా వచ్చాక నా కోసం ఎవరో హాస్టల్లో ఎదురు చూస్తున్నారని చెప్పాడు మా హాస్టల్ అబ్బాయి"

అత్రి కళ్లలో నిజాయితీ అతను అబద్ధం చెప్పడం లేదని చెబుతోంది. కానీ, 'వీడి చదువు - ఇక్కడి పనులు...' సమన్వయం కుదరలేదు చంద్రకి.

"బుద్ధిగా చదువుకోక ఈ వ్యాపకాలన్నీ ఎందుకురా?" చిరాకు పడ్డాడు.

ఒక్క క్షణం ఎలా చెప్పాలో తోచలేదు అత్రికి. ఆపై నెమ్మదిగా కూడబలుక్కున్నట్టు చెప్పాడు. "మావయ్యా! నాన్న మా కోసం చాలా కష్టపడుతున్నారు. ఇంకా కష్టపెట్టడం నాకిష్టం లేదు. కనీసం పై ఖర్చులకైనా సరిపడా నేను సంపాదించుకోవాలి కదా! నాన్న స్కూటర్ కూడా అమ్మేశారు. చెబితే వినరు. ఎలాగైనా సరే డబ్బులు జమ చేసి, నాన్నకో స్కూటరు కొంటాను..."

ఆశ్చర్యంతో అవాక్కయ్యాడు చంద్ర.

"ఇప్పటికి తొమ్మిది వేలయ్యింది...ఈ ఏడాది చివరికల్లా సరిపడా చేస్తాను." ఆత్మవిశ్వాసం, తండ్రి పట్ల అభిమానం తొణికిసలాడుతున్నాయి అత్రి మాటల్లో.

"అత్రీ! నువ్విలా కష్టపడుతున్నావని తెలిస్తే మీ నాన్న బాధ పడడా? అయినా నువ్విక్కడికొచ్చి, హాస్టల్లో ఉంటున్నది చదవడానికా? లేక..."

"మావయ్యా! నేను మాధవరావు కొడుకుని. ఎట్టి పరిస్థితుల్లో నా చదువు నిర్లక్ష్యం చేయను. ఫస్టు సెమిస్టర్‌లో 93 శాతం మార్కులు..." సాత్వికాహంకారం తొంగి చూసిందతని గొంతులో.

సంతోషంతో కళ్లు చెమ్మగిల్లాయి చంద్రకి.

'నువ్వురా తండ్రికి తగ్గ తనయుడివి. అయినా నీకు ఇంత మంచి ప్రేరణనూ, బుద్ధినిచ్చిన మీ నాన్నకు, మీ నాన్న గుండెలో కొలువైన వాళ్ల నాన్నకూ చెప్పాలి జేజేలు' అనుకుంటూ పొంగిపోయాడు.

